# వలీ (సంరక్షకుని) బాధ్యతలు

**72వ అంశం** **స్త్రీ అంగీకారానికి వ్యతిరేకంగా 'వలీ' నిర్ణయం గైకొనకూడదు.**

వివరణ: వివరాలకు 66వ నిబంధన క్రింద ఉన్న సూక్తిని చూడండి.

**73వ అంశం** **కన్య అయినా, వితంతువు అయినా అంగీకారం లేకుండా 'వలీ' వారి వివాహం జరిపించరాదు.**

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "వితంతువును సంప్రదించకుండా ఆమె వివాహం జరిపించకూడదు. కన్య అనుమతి లేకుండా ఆమె నికాహ్ జరిపించరాదు. 'దైవప్రవక్తా (స)! కన్నెపిల్ల అనుమతి ఎలా ఉంటుంది?' అని ప్రియ సహచరులు (రజి) అడిగితే, "ఆమె మౌనంగా ఉంటే (తిరస్క రించకుండా ఉంటే) అదే ఆమె అంగీకారం" అని ఆయన (స) వివరించారు.

(బుఖారీ-5136, 6968).[1]

**74వ అంశం** **స్త్రీకి ఇష్టం లేనప్పుడు 'వలీ' ఆమెను బలవంతంగా ఒప్పించకూడదు.**

దైవప్రవక్త (స) ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) చెప్పారు: "కన్య అయిన స్త్రీ తన నికాహ్ సమయంలో సంప్రదించబడుతుంది. ఒకవేళ ఆమె (సమాధానంగా) మౌనంగా ఉంటే అదే ఆమె అంగీకారం అనుకోవాలి. ఒకవేళ నిరాకరిస్తే ఆమెను బలవంతం చేయ కూడదు." (అబూదావూద్-2093హసన్)[2]

**వివరణ:** అబ్బాయిగానీ, అమ్మాయిగానీ అనుభవలేమి మూలంగా నిర్ణయం గైకొనటంలో పొరబడుతుంటే, వారి తొందరపాటు చర్య ఎలాంటి విపత్కర పరిస్థితికి దారి తీస్తుందో 'వలీ' వివరించి, నిర్ణయం మార్చుకునేలా చేయవచ్చు. అంతేగాని బలవంతం చేయకూడదు.

**75వ అంశం** **స్త్రీ ఇష్టానికి వ్యతిరేకంగా ఆమె సంరక్షకుడు బలవంతంగా వివాహం జరిపిస్తే, స్త్రీ షరీయత్ కోర్టును ఆశ్రయించి తన నికాహ్‌ను రద్దు చేయించగలదు.**

---

1. కితాబున్నికాహ్- లా యన్‌కిహుల్ అబు వ గైరల్ బక్‌ర వస్సయ్యిబ్ బిరిజాహ.
2. సహీహ్ సుననె అబూదావూద్, లిల్ అల్‌బానీ- రెండవ భాగం, హ.నెం.1843, తిర్మిజీ సహీహ్ 1109

teluguislam.net



అన్సారీ మహిళ అయిన హజ్రత్ ఖన్సా బిన్తె హజామ్ (ర.అన్హా) ఇలా తెలిపారు: "తను వితంతువుగా ఉన్నప్పుడు తన తండ్రి ఒకానొక వ్యక్తితో తన వివాహం జరిపించాడు. తాను మాత్రం ఆ వ్యక్తిని ఇష్టపడలేదు. అందుచేత ఆమె దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, తన గోడు వినిపించుకుంది. దైవప్రవక్త (స) ఆమె తండ్రి జరిపించిన వివాహాన్ని రద్దు పరిచారు." ఈ హదీసును బుఖారీ పొందుపరిచారు.[1]

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) తెలిపారు: "ఒక కన్నెపిల్ల దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి, తన తండ్రి తనకు ఇష్టంలేని వ్యక్తికిచ్చి నికాహ్ జరిపించాడని ఫిర్యాదు చేసింది. అప్పుడు దైవప్రవక్త (స) ఆమెకు నిర్ణయాధికారం ఇచ్చారు. (అంటే ఆమె కోరితే ఆ నికాహ్‌ను కొనసాగించవచ్చు లేదంటే నికాహ్‌ను రద్దు పరచవచ్చు)."(అబూదావూద్-2996 సహీహ్)[2]

**76వ అంశం** స్త్రీ పురుషులు 'తలాఖె రజ్‌యీ' తరువాత ఇద్దత్ (గడువు) ముగియగానే మళ్లీ పెళ్ళి చేసుకోదలిస్తే సంరక్షకుడు అడ్డు తగలకూడదు.

హజ్రత్ మాఖల్ బిన్ యసార్ (రజి) తెలిపారు: "నాకొక చెల్లి ఉండేది. ఆమెకు పెళ్ళి సంబంధం వచ్చింది. తరువాత మా బాబాయి కుమారుడు వస్తే నా చెల్లిని అతనికిచ్చి నికాహ్ జరిపించాను. మరి కాస్సేపటికే అతను నా చెల్లికి 'రజ్‌యీ తలాఖ్' ఇచ్చి, వదలి పెట్టేశాడు. గడువు (ఇద్దత్) ముగిసిన తర్వాత నా చెల్లికి మరో చోటి నుంచి పెళ్ళి సంబంధం వచ్చింది. అదే సమయంలో మా బాబాయి కొడుకు కూడా వివాహ సందేశం తీసుకుని వచ్చాడు. 'దైవసాక్షి! ఎన్నటికీ నా చెల్లిని నీకిచ్చి వివాహం జరపను' అన్నాను నేను. అప్పుడు ఈ వ్యవహారంపై ఈ సూక్తి అవతరించింది: 'మీరు మీ స్త్రీలకు విడాకులు ఇచ్చిన తరువాత, వారు తమ గడువు (ఇద్దత్)ను ముగించి, తమ (మాజీ) భర్తలను ధర్మబద్ధంగా పరస్పరం ఇష్టపడి వివాహమాడదలిస్తే మీరు వారికి అడ్డు తగలకండి" (అల్ బఖర: 232) హజ్రత్ మాఖల్ బిన్ యసార్ (రజి) ఇలా అన్నారు: ఈ ఆయతు అవతరించిన తరువాత నేను నా ప్రమాణభంగానికి పరిహారం (కప్ఫారా) చెల్లించి, నా చెల్లిని బాబాయి కుమారునికిచ్చి నికాహ్ జరిపించాను." (అబూదావూద్-2087, ముస్లిం-5330, బుఖారి-4592)[3]

1. కితాబున్నికాహ్- బాబు ఇజా జవ్వజర్రజులు ఇబ్నతహు వహియా కారిహతున్
2. సహీహ్ సుననె అబీదావూద్, లిల్ అల్‌బానీ- రెండవ భాగం, హ.నెం.1845
3. సహీహ్ సుననె అబీదావూద్ లిల్ అల్‌బానీ - రెండవ భాగం, హ.నెం.1837